# త్రినేత్ర

సత్యం ధర్మం జ్ఞానం

Hyderabad
14 June, 2026
8:00 PM Edition

www.trinethra.news

360° Digital News




# నేనే రోడ్‌పైకి వస్తా

## వర్షాల పైన రివ్యూ పెట్టి.. నేను సూచనలిచ్చినా మీరు పట్టించుకోలేదు

- వర్షం పడినప్పుడు.. యంత్రాంగమంతా ఫీల్డ్‌లో ఉండాల్సిందే
- మున్సిపల్ - పోలీసు విభాగాల మధ్య సమన్వయం లేదు
- ఇలాగైతే ఎలా.. ప్రాజెక్టుల వద్ద అప్రమత్తంగా ఉండండి
- రైతు వేదికల్లో యూరియా ఇవ్వండి.. అధికారులందరికీ సీఎం క్లాస్

వర్షం కురిసిన సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైన ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైతే తానే స్వయంగా రోడ్‌పైకి వస్తానని స్పష్టం చేశారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు వస్తే సహించబోనన్నారు. ట్రాఫిక్ డిపార్ట్మెంట్‌లో తక్షణమే ఖాళీలు పూర్తి చేయాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో వర్షాలు, ప్రకృతి విపత్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష ఆదివారం సమీక్షించారు. వర్షాల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.


**త్రినేత్ర.న్యూస్:**

ఈ నెల 1న సమీక్షా సమావేశం నిర్వహించి, వర్షాలపై ముందస్తు సూచనలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 9న వర్షం సమయంలో అధికారులు సరిగా పని చేయలేదని మండిపడ్డారు. వర్షం సమయంలో క్యూర్ ఏరియాలో మునిసిపల్, పోలీస్ అధికారుల మధ్య సమన్వయం లేదని తేల్చి చెప్పారు. వర్షం వచ్చినప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్స్, బ్లాక్ స్పాట్స్, ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాల డేటా ఆధారంగా పని చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ఆదే శించారు. ఫీల్డ్ లో ఉండని అధికా రులపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్రాజెక్టుల నిర్వహణకు తక్షణమే నిధులు..**

వర్షాల నేపథ్యంలో ప్రాజెక్ట్‌ల దగ్గర పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి

తరువాయి 3లో



# ట్రాఫిక్ జామ్‌కు గుడ్‌బై

రోడ్డు మీద ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని విసిగిపోయారా? మీకంటూ సొంతంగా గాల్లో ఎగిరే కారు ఉంటే ఎంత బాగుంటుంది కదా! మీ కలను నిజం చేస్తోంది స్వీడన్‌కు చెందిన స్టార్టప్ సంస్థ జెట్‌సన్. 'జెట్‌సన్ వన్' పేరుతో ఒక అద్భుతమైన ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ వెహికల్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది.

4



# మీనాక్షిపై రేవంత్ దొంగ కేసు

- స్కామ్‌లు, అక్రమాలు అధిష్టానానికి చెప్పినందుకే..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు

2



# రేవంత్ రిజైన్ చేస్తేనే హైదరాబాద్ అభివృద్ధి




- నగర ప్రజలు మిమ్మల్ని గద్దె దింపుతారు
- ఇదే మీ ఫ్యూచర్
- మూడు కార్పొరేషన్లలో బీజేపీ గెలుస్తుంది
- అంబర్‌పేట కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డిపై బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు ఫైర్
- నన్ను తరిమికొట్టేవారు ఈ గడ్డమీద పుట్టలే: కిషన్‌రెడ్డి

3




నీట్ పరీక్షల్లో జరిగిన లీకేజీలపై నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో భారీ ఆందోళన నిర్వహించారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతతో పాటు పార్టీ మద్దతుదారులు హాజరయ్యారు. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే, హక్కుల కార్యకర్త సోనం వాంగ్ చుక్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. నీట్ లీకేజీకి బాధ్యులైన కేంద్ర మంత్రిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే రాజీనామా చేయాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు.



## కొత్తగూడెంలో అర్ధరాత్రి భూకంపం..

- **పరుగులు తీసిన జనం**

**త్రినేత్ర.న్యూస్:**
భద్రాద్రి కొత్తగూడెంలో స్వల్ప భూకంపం వచ్చింది. ఆదివారం తెల్లవారుజామున 2.26 గంటలకు పాల్వంచ, బూర్గంపాడు, కొత్తగూడెం ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.8గా నమోదైంది. భూమి అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి 11 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. మంచి నిద్రలో ఉండగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఇండ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.



## ఒకే రోజు RRB, TET పరీక్షలు..

- **ఆందోళనలో అభ్యర్థులు**

**త్రినేత్ర.న్యూస్:**
తెలంగాణ టెట్, ఆర్ఆర్బీ పరీక్షలు రెండూ ఈ నెల 17న ఉన్నాయని, దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఒకే రోజు రెండు పరీక్షలు ఉండటంతో అభ్యర్థులు ఏదో ఒక దానిని వదులుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ ఉద్యోగాలతో పాటు రైల్వే ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న వేలాది మంది నిరుద్యోగ యువత ఒకే రోజు రెండు కీలక పరీక్షలు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.



## అసత్య ప్రచారం వద్దు

- **సంధ్య థియేటర్ ఘటనపై కోర్టు ఆదేశం**

**త్రినేత్ర.న్యూస్:**
సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసుపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేసు విచారణ కొనసాగుతోందని, నిజానిజాలు తేలకముందే ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎలాంటి అసత్య ప్రచారాలు, ఊహాగానాలు చేయద్దని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటోన్న అల్లు అర్జున్‌తో పాటు మిగిలిన వారిపై సోషల్ మీడియాలో అనేక పుకార్లు వ్యాప్తి అవుతోన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది.

# మీనాక్షిపై రేవంత్ దొంగ కేసు

- **స్కామ్‌లు అధిష్టానానికి చెప్పినందుకే**
- **సీఎం రేవంత్‌పై మండిపడిన కేటీఆర్**

**రేవంత్‌రెడ్డి సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచిన వ్యక్తని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. రేవంత్ అక్రమాలు, స్కాములను అధిష్టానంకు చెప్పినందుకే మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ రెడ్డి దొంగ కేసు పెట్టిండని విమర్శించారు. తాను పెట్టిన దొంగ కేసును బీజేపీకి ఇచ్చి.. మీనాక్షికి పదవి రాకుండా చేసిండని మండిపడ్డారు.**
**- త్రినేత్ర.న్యూస్**



మీనాక్షి నటరాజన్‌కు టిక్కెట్ రాకుండా అడ్డుకోవడమే కాకుండా, తప్పుడు కేసులు పెట్టించడం రేవంత్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న కొంత మంది వ్యక్తుల్లో మీనాక్షి నటరాజన్ నిజాయితీగల మనిషి.. రాహుల్ గాంధీకి నమ్మిన బంటు అన్న కేటీఆర్.. ఆమెపై రేవంత్ రెడ్డి కుట్ర చేశారని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి భూములు, కాంట్రాక్టులు అమ్ముకుంటున్నాడు, అడ్డగోలు అవినీతి చేస్తున్నాడని మీనాక్షి నటరాజ్ రాహుల్ గాంధీకి చెప్పినందుకే రేవంత్ పగపట్టారన్నారన్నారు. అందుకే మీనాక్షి నటరాజనం మీద రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో దొంగ కేసు పెట్టించారన్నారన్నారు.

### దొంగ కేసు వివరాలు బీజేపీకి ఇచ్చి..

రేవంత్‌రెడ్డి చేసిన కుట్ర సమాచారం కూడా లేని ఆమె రాజ్యసభకు నామినేషన్ వేసిందని తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి తాను పెట్టిన దొంగ కేసు వివరాలు బీజేపీకి ఇచ్చారని ఆరోపించారు. ఇలా ప్రజలకే కాకుండా సొంత పార్టీ వాళ్లకి గుండు కొట్టి, శఠగోపం పెట్టిన దొంగ రేవంత్ రెడ్డి అని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నానని సీఎం ప్రకటించడం సిగ్గుచేటు అని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. సినిమా ట్రైలర్ చూడగానే హిట్ లేదా ఫ్లాప్ అని తెలిసినట్లే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటర్వెల్‌కే ఫ్లాప్ అని తేలిపోయిందని, ఈ రెండున్నర ఏళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు.. కాంగ్రెస్ పాలనకు మిగిలింద్ ఏండ్ కార్డే అన్నారు. అడ్డగోలుగా హామీలిచ్చిన అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. అందరినీ మోసం చేస్తున్నదన్నారు.

### ప్రజాతీర్పును అవమానించడమే..

ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని కేటీఆర్ అన్నారు. త్వరలో ఉపఎన్నికలు వస్తాయన్న కేటీఆర్ ఆ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పి, మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపిస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "జీవో నెంబర్ 50 ద్వారా పేదలకు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌ది. హైదరాబాద్‌లో ఇటుక కూడా వేయని కాంగ్రెస్, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గం" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నాలుగువేల ఉద్యోగాలు భర్తీ చేయలే..

సగంకాలం ముగిసినా ఒక్క హామీల అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఒక అట్టర్ ఫ్లాప్ సినిమాతో పోల్చారు కేటీఆర్. నిరుద్యోగుల సమస్యలను ప్రస్తావిస్తూ, మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటివరకు 4 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని, నిరుద్యోగ భృతి రూ.4వేల హామీని కూడా గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయడం లేదని నిలదీశారు. మహిళా హామీపై స్పందిస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. అది నెరవేరితే నిరూపించాలని, లేని పక్షంలో తాను రాజీనామాకు సిద్ధమని కేటీఆర్ సవాల్ విసిరారు. ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.1.25 లక్షలు బాకీ ఉందని గుర్తుచేశారు.



## విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి టీజీఎస్ఆర్టీసీ సిద్ధం

- **ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి**

**త్రినేత్ర.న్యూస్: వేసవి సెలవుల అనంతరం 2026-27 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలు రేపటి (జూన్ 15 సోమవారం) నుంచి రాష్ట్రవ్యాప్తంగా పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు.**

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్లను విధిగా పునరుద్ధరించాలన్నారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో ఖచ్చితమైన సమయ పాలన పాటించాలని, అవసరమైన చోట అదనపు ట్రిప్పులు నడపాలని ఆదేశించారు.

# బీఎల్‌ఏలు బాధ్యతాయుతంగా పని చేయాలి

**త్రినేత్ర.న్యూస్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దేలా బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు.**



క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇబ్రహీంపట్నంలో టీపీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' అవగాహన–శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణా తరగతులలో బీఎల్ఏ ట్రైనర్ చైతన్య కృష్ణారెడ్డి పాల్గొని ఏజెంట్లకు కావలసిన సాంకేతిక, క్షేత్రస్థాయి విధి విధానాలపై సమగ్ర శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, ప్రత్యేక సమగ్ర సవరణ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# తదుపరి సీఎస్ ఎవరో?

- **30న ముగియనున్న రామకృష్ణారావు పదవీకాలం**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెలాఖరున ముగియనుంది. ఈ నేపథ్యంలో తదుపరి సీఎస్ ఎవరనే చర్చ మరోసారి మొదలైంది.**
**త్రినేత్ర.న్యూస్:**



మరోసారి ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతేడాది ఆగస్టు 31న రామకృష్ణారావు పదవీ కాలం ముగిసింది. ఆయనను కొనసాగించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో ఏడు నెలలు కేంద్రం పొడిగించింది. ఈ ఏడాది మార్చి 31న ఆ సమయం కూడా ముగియగా మరింత కాలం పొడిగించాలని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించటంతో ఆ గడువు జూన్ 30న ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ మరోసారి సీఎస్ పదవీకాలాన్ని కేంద్రం పొడిగిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తదుపరి సీఎస్‌గా ఎవరు నియమితులవుతారనేది చర్చనీయాంశంగా మారింది.

### రేసులో సీనియర్ ఐఏఎస్‌లు..

సీనియర్ ఐఏఎస్ లు సంజయ్ జాజు, జయేశ్ రంజన్, వికాస్‌రాజ్, సవ్యసాచి ఘోష్ రేసులో ఉన్నట్లు తెలుస్తున్నది. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్ ఈ ఏడాది సెప్టెంబరు 30న, మెట్రో పాలిటన్ అభివృద్ధి ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌కు 2027 సెప్టెంబర్ లో పదవీ విరమణ చేయనున్నారు. కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు 2029 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేయనున్నప్పటికీ, ఆయన రాష్ట్రానికి రావడానికి ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. రవాణా, ఆర్ అండ్ బీ ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్ 2028 మార్చి, ఫ్లాగ్‌షిప్ పథకాల అమలు విభాగం ప్రత్యేక సీఎస్ సవ్యసాచి ఘోష్ 2027 ఏప్రిల్ వరకు సర్వీసు ఉంది. నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్ కూడా ప్రత్యేక సీఎస్ హోదాలో ఉన్నారు.



## ఆ ఆడియో క్లిప్ కల్పితమైనది

- క్రమశిక్షణా కమిటీకి వివరణ ఇచ్చిన షబ్బీర్ అలీ

త్రినేత్ర.న్యూస్:

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఆడియో క్లిప్ కల్పితమైనదని, నకిలీదని కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చెప్పారు. తనను రాజకీయంగా దెబ్బతీసేం దుకు ఆ క్లిప్‌ను సృష్టించారని అభిప్రాయప డ్డారు. తనపై వస్తున్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు షబ్బీర్ అలీ లిఖితపూర్వక వివరణ అందజేశారు. తనకు షోకాజ్ నోటీసు జారీ చేసేకంటే ముందే తాను ఆ క్లిప్‌పై పోలీసు లకు ఫిర్యాదు చేశానని వివరించారు. తన ప్రతిష్టను దెబ్బతీయడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలహీనపరిచేందుకు కొందరు ఈ కుట్రకు తెర తీశారని అభిప్రాయపడ్డారు. టీపీసీసీ చీఫ్ తనకు సోదర సమానుడని చెప్పారు.



## ఫామ్‌హౌస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

త్రినేత్ర.న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ శివారులోని ఒక ఫామ్‌హౌస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడిని మంచిర్యాల జిల్లాకు చెందిన గుండ్ల మధు(27)గా గుర్తించారు. అతడు సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వీకెండ్ కావడంతో సంస్థ ఉద్యోగులు 15 మంది శనివారం సాయంత్రం ఫామ్‌హౌజ్‌లో గెట్ టు గెదర్ పార్టీ జరుపుకున్నారు. ఆదివారం ఉదయం లేచేసరికి మధు విగతజీవిగా కనిపించారు. పోలీసులకు సమాచారం రాగా, అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మధు శరీరంపై గాయాలు కనిపించినట్లు సమాచారం. దీనిపై మధు తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# హైదరాబాద్‌లో కాక్రోచ్ ఆందోళన

త్రినేత్ర.న్యూస్:

నీట్ పరీక్షల్లో జరిగిన లీకేజీలపై నిరసనగా కాక్రాచో జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో భారీ ఆందోళన నిర్వహించారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతతో పాటు పార్టీ మద్దతుదారులు హాజరయ్యారు. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే, హక్కుల కార్యకర్త సోనం వాంగ్ చుక్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. నీట్ లీకేజీకి బాధ్యులైన కేంద్ర మంత్రిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే రాజీనామా చేయాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సోనం వాంగ్ చుక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ ఘటనకు బాధ్యత వహించాల్సిందేనని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అస్తవ్యస్తమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 'కాక్రాచో ఉద్యమం' దీర్ఘకాలంగా కొనసాగుతుందని స్పష్టం చేసిన వాంగ్ చుక్, దేశ అభివృద్ధి నినాదాల వెనుక వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. కోట్లాది యువత ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో కూడా పారదర్శకత లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. దేశంలో పాలనా వ్యవస్థ తప్పుదోవ పట్టిందని ఆయన ఆరోపించారు. లంచగొండితనం పెరిగిపోయిందని, దేశ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతమవుతోందని వ్యాఖ్యానించారు. అంబానీ, ఆదానీ వంటి పెద్ద వ్యాపార వర్గాల వద్దే సంపద కేంద్రీకరణ జరుగుతోందని ఆయన ఆరోపించారు. దేశంలో నాణ్యమైన విద్య అందించే పరిస్థితి క్షీణిస్తోందని, పాలకులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆకునూరి మురళి విమర్శించారు.




# రేవంత్ రిజైన్ చేస్తేనే హైదరాబాద్ అభివృద్ధి

- మూడు కార్పొరేషన్లలో బీజేపీ గెలుస్తుంది
- అంబర్‌పేట కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డిపై బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు ఫైర్

త్రినేత్ర.న్యూస్:

మున్సిపల్ శాఖను దగ్గర పెట్టుకున్న సీఎం రేవంత్ రాజీనామా చేస్తేనే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతుందని బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. ప్రతి సారి మా ఎంపీలపై నోరు పారేసుకుంటూ రాజీనామా చేయాలని రేవంత్ అనడంపై ఆయన మండిపడ్డారు. హైదరాబాద్ ప్రజలు మిమ్మల్ని గద్దె దింపుతారని, ఇదే మీ ఫ్యూచర్ అని ఎద్దేవా చేశారు. ఉన్న సిటీని వదిలేసి ఫ్యూచర్ సిటీపై పడ్డారన్నారు. ఆదివారం నిర్వహించిన అంబర్‌పేట కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మూడు కార్పొరేషన్లలో బీజేపీ గెలుస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలతో విసిగిపోయిన నగర ప్రజలు నిజమైన మార్పు, సుపరిపాలన కోసం బీజేపీనే ఏకైక ఆశగా చూస్తున్నారన్నారు.

**మదర్ ఆఫ్ ఆల్ లైస్‌గా తెలంగాణ..**

మూడు కార్పొరేషన్ల పరిధిలో కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి. కాంగ్రెస్ నాయకులు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. రెండున్నరేళ్లలోనే వ్యతిరేకత వచ్చింది. రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదు. ప్రజలకు



అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. మదర్ ఆఫ్ ఆల్ లైస్‌గా తెలంగాణ మారింది అని రాంచందర్‌రావు ఫైరయ్యారు.

**సెక్రెటేరియట్ గేట్ దగ్గర కూర్చొని చర్చిద్దాం..**

ప్రభుత్వం ధాన్యం కొనలేని పరిస్థితిలో ఉంది. కొన్నది కూడా ఎమ్మెస్పీ ధర లేకుండా మోసపూరితంగా కొన్నారు. పైగా ఎక్కువ ధాన్యం ప్రభుత్వం కొన్నదని పేపర్లలో అబద్దపు ప్రచారం చేశారు. సగం కన్నా ఎక్కువ ధాన్యాన్ని కేంద్రం కొన్నది. మరి నువ్ ముఖ్యమంత్రిగా ఎందుకు ఉన్నవ్ రేవంత్? ఇదెక్కడి న్యాయం అని అడుగుతున్నా. ఏం తేలేదని మా ఎంపీల మీద ఏడుస్తున్నరు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో సెక్రెటేరియట్ గేట్ దగ్గర కూర్చొని చర్చిద్దాం. నేను సిద్ధం. శ్వేత పత్రం విడుదల చేయండి. మేం సమాధానం ఇస్తాం. హైదరాబాద్ ప్రజల చెవుల్లో పూలు పెట్టకండి అని ఆయన సూచించారు.

**అల్వాల్‌లో తండ్రి బిడ్డలు చనిపోయారు..**

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మీ దగ్గరే ఉంది. మొన్నటి వర్షానికి అల్వాల్ తండ్రి బిడ్డలను చనిపోయారు. ఇది మీ బాధ్యత కాదా? మీరు రాజీనామా చేస్తారా? హైదరాబాద్‌లో వానలు రావడానికి ముందే అప్రమత్తంగా ఉండాలని తెలియదా? మీరు రిజైన్ చేస్తే కనీసం సిటీ బాగుపడుతుంది. హైదరాబాద్ ప్రజలు మిమ్మల్ని గద్దె దింపుతారు. ఇదే మీ ఫ్యూచర్. అసలు మీకు ఫ్యూచర్ లేదు అని ఎద్దేవా చేశారు.

**ప్రేమ బంధాన్ని ప్రజలు చూస్తున్నరు..**

బీఆర్ఎస్, కాంగ్రెస్ దోస్తానీ బయటపడ్డది. ఒకరికొకరు కాపాడుకుంటున్నారు. ఈ రెండు పార్టీలకు ఎంఐఎం మధ్యవర్తిత్వం వహిస్తున్నది. మీ ప్రేమ బంధాన్ని ప్రజలు చూస్తున్నరు. మూడు కార్పొరేషన్‌లలో బీజేపీని గెలిపించండి. లేదంటే నగరం అభివృద్ధి జరగదు. హైదరాబాద్ మేయర్‌గా బీజేపీ అభ్యర్థిని గెలిపించి అభివృద్ధిని చూడండి. అన్నీ స్కీమ్‌లు తెచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తాం. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు. అది జరగాల్సిందే. సైబర్ టవర్స్, గచ్చిబౌలి స్టేడియం వంటివి అప్పుడే ఏర్పడ్డాయి. ఇవన్నీ విషయాలు ప్రజల వద్దకు వెళ్లి చెప్పాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు.

## నన్ను తరిమికొట్టేవారు ఈ గడ్డమీద పుట్టలే

- కిషన్‌రెడ్డి

మెట్రోరైల్‌కి కేంద్రం నిధులు ఇచ్చింది. మెట్రోకి డబ్బులు ఇవ్వలేదని నిరూపిస్తూ మేం రాజీనామా చేస్తాం. హామీలు అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా? నన్ను తరిమికొడతానని రేవంత్ అంటున్నారు. నేను BRS కార్యకర్తని కాదు.. BJP కార్యకర్తని. నన్నుఅడ్డుకునే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా? నన్ను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద పుట్టలేదు. తెలంగాణ బిడ్డలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచింది. ఎవరు రాజీనామా చేస్తారో రాహుల్, రేవంత్ చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఆట మొదలు పెట్టారు. బీజేపీ 2028లో ఆట ముగిస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే అని కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు.

# మేం రాజీనామా చేస్తాం.. నువ్వు సిద్ధమా

- సీఎం రేవంత్ రెడ్డికి రఘునందన్ రావు సవాల్

త్రినేత్ర.న్యూస్:

తెలంగాణ రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి, ఎన్నికలకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారా అని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రతి సవాల్ విసిరారు. కేంద్రం నుంచి సహకారం అందడం లేదని, సరైన నిధులు రావడం లేదని ఆరోపిస్తూ ఇటీవల పలుమార్లు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలను రాజీనామా చేయాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్ కు స్పందిస్తూ



రఘునందన్ రావు ప్రతి సవాల్ విసిరారు. రేవంత్ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు రావాలని సూచించారు. రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తారని,, కావాలంటే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలను అట్లాగే ఉంచుకోవచ్చని చెప్పారు. ఎవరు గెలుస్తారో ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుందామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌కు చేతనైతే తమ సవాల్ స్వీకరించాలని అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తే తమకు కొడంగల్‌లో, ప్రగతిభవన్ ముందు వడ్లు పోసుడు రాదా అని ప్రశ్నించారు. కానీ తాము ముఖ్యమంత్రి పదవికి గౌరవమిస్తున్నామని చెప్పారు. తమ సంస్కారాన్ని చేతకానితనం అనుకోవద్దని హితవు పలికారు. బీజేపీ కా ర్యకర్తలు నోటికి పనిచెబితే కాంగ్రెస్ ముఖ్యమంత్రి, మంత్రులు, నాయకులు ఎవరూ తట్టుకోలేరని చెప్పారు. ఇప్పటికైనా నోటిని అదుపులో పెట్టుకోవాలని ముఖ్యమంత్రికి రేవంత్ కు సూచించారు.

# నేనే రోడ్‌పైకి వస్తా

**మొదటిపేజీ తరువాయి..**

సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ మ్యాన్యువల్ ప్రకారం జరగాలని, ప్రాజెక్టు సంబంధిత ఇంజనీర్లు కచ్చితంగా దానిని అమలు చేయాల్సిందేనన్నారు. ప్రాజెక్టుల సీఈలు, ఎస్‌ఈ లు ఈ సీజన్‌లో స్థానికంగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్టులు వదిలి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాజెక్టుల మెయింటెన్స్, గేట్ల మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఇరిగేషన్, మెట్రో వాటర్ బోర్డు, RWS అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రైతు వేదికగా యూరియాను పంపిణీ చేయాలని, ఈ బాధ్యతను స్థానిక అగ్రికల్చర్ అధికారికి అప్పగించాలన్నారు. యూరియా పంపిణీలో రెవిన్యూ సిబ్బందిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మూడు కార్పొరేషన్ల మున్సిపల్ కమిషనర్‌లు, పోలీస్ కమిషనర్లు, హైడ్రా కమిషనర్ పాల్గొన్నారు.



# ట్రాఫిక్ జామ్‌కు గుడ్‌బై

రోడ్డు మీద ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని విసిగిపోయారా? మీకంటూ సొంతంగా గాల్లో ఎగిరే కారు ఉంటే ఎంత బాగుంటుంది కదా! మీ కలను నిజం చేస్తోంది స్వీడన్‌కు చెందిన స్టార్టప్ సంస్థ జెట్‌సన్. 'జెట్‌సన్ వన్' పేరుతో ఒక అద్భుతమైన ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ వెహికల్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ప్రత్యేకత ఏంటంటే.. ఇది నడపడానికి మీకు పైలట్ లైసెన్స్ కూడా అవసరం లేదు! కేవలం ఐదు రోజుల ట్రైనింగ్ తీసుకుంటే చాలు, గాల్లోకి రయ్యిన దూసుకెళ్లొచ్చు. - త్రినేత్ర.న్యూస్

## జెట్‌సన్ వన్ ప్రత్యేకతలు

ఇది పూర్తిగా విద్యుత్‌తో నడిచే సింగిల్ సీట్ ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (eVTOL) ఎయిర్‌క్రాఫ్ట్.

- **గరిష్ఠ వేగం):** గంటకు 102 కిలోమీటర్లు (102 km/h).
- **ఫ్లైట్ టైమ్:** ఒక్కసారి బ్యాటరీ ఫుల్ ఛార్జ్ చేస్తే 20 నిమిషాల పాటు గాల్లో ఎగరొచ్చు.
- **రేంజ్:** ఒక ఛార్జింగ్‌తో దాదాపు 17.7 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.
- **ఎత్తు:** భూమి నుంచి గరిష్టంగా 1,500 అడుగుల ఎత్తు (AGL) వరకు వెళ్లగలదు.
- **బరువు:** ఈ ఎయిర్‌క్రాఫ్ట్ బరువు 115 కిలోలు. ఇందులో గరిష్టంగా 95 కిలోల బరువున్న పైలట్ కూర్చోవచ్చు.
- **పవర్‌ఫుల్ మోటార్లు:** అల్యూమినియం, కార్బన్ ఫైబర్‌తో తయారు చేసిన ఫ్రేమ్‌పై 8 ఎలక్ట్రిక్ మోటార్లు, 8 ప్రొపెల్లర్లు అమర్చారు.

- **పైలట్ లైసెన్స్ అవసరం లేదు**
- **ధర ఎక్కువైనా ఫీచర్లు అదుర్స్**
- **అదే 'జెట్‌సన్ వన్'**
- **ప్రారంభమైన బుకింగ్**
- **అధిక డిమాండ్‌తో 2026 స్లాట్స్ ఫుల్**

ఫార్ములా వన్ రేసింగ్ కారు డిజైన్‌ను, అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీని కలగలిపి ఇటలీలో ఈ పర్సనల్ ఏవియేషన్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను తయారు చేస్తున్నారు.

### సేఫ్టీకే ఫస్ట్ ప్రియారిటీ

గాల్లో ఎగురుతున్నప్పుడు ఏమైనా ప్రమాదం జరిగితే ఎలా? అనే భయం అక్కర్లేదు. పైలట్ భద్రత కోసం కంపెనీ ఇందులో ఆటోమేటెడ్ టెక్నాలజీని వాడింది. ముందున్న అడ్డంకులను ఆటోమేటిక్‌గా పసిగట్టి తప్పించుకునే ఆబ్స్టాకిల్ అవాయిడెన్స్ టెక్నాలజీ ఇందులో ఉంది. చేతులు వదిలేసినా గాల్లో అలా స్థిరంగా ఉండిపోయే ఫీచర్ ఉంది. మధ్యలో ఏదైనా ఒక మోటార్ ఫెయిల్ అయినా.. మిగతా మోటార్లకు పవర్‌ను అడ్జస్ట్ చేసి క్రాష్ అవ్వకుండా సురక్షితంగా ప్రయాణించేలా డిజైన్ చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం లిడార్ రాడార్‌తో పనిచేసే ఆటోమేటిక్ ల్యాండింగ్ సిస్టమ్, ప్రాణాలను కాపాడే బాలిస్టిక్ పారాచూట్ ఇందులో ఉన్నాయి.

దీనికి మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. 2026 వరకు ప్రొడక్షన్ స్లాట్స్ అన్నీ బుక్ అయిపోయాయి. ఇప్పుడు ఆర్డర్ చేస్తే 2027లో డెలివరీ ఇస్తారు. ప్రముఖ టెక్ దిగ్గజం, ఓకులస్ ఫౌండర్ పామర్ లక్కీ ఇప్పటికే ఈ 'జెట్‌సన్ వన్' కారును డెలివరీ తీసుకోవడం విశేషం. సాధారణ ప్రయాణాలకే కాకుండా, మారుమూల పర్వత ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్క్యూ ఆపరేషన్ల కోసం కూడా దీనిని ఉపయోగించేందుకు కంపెనీ ఏర్పాట్లు చేస్తోంది.





### ధర ఎంత? ఎలా బుక్ చేసుకోవాలి?

ఈ పర్సనల్ ఎయిర్ వెహికల్ ధర $128,000 డాలర్లు (అంటే మన కరెన్సీలో సుమారు రూ. 1.07 కోట్ల నుంచి రూ. కోటి 25 లక్షల వరకు ఉంటుంది). దీనిని కొనుగోలు చేయాలనుకునే వారు కేవలం రూ. 7 లక్షల 63 వేలు చెల్లించి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు.





# పెట్రోల్ కష్టాలకు చెక్..

- ఇక మార్కెట్‌లోకి 100 % ఇథనాల్..
- తక్కువ ధరకే లభ్యం
- పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా 100% ఇథనాల్
- వాహనదారులకు గుడ్ న్యూస్ చెప్పిన నితిన్ గడ్కరీ
- మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్ నుంచి ఇప్పటికే ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాల లాంచ్
- రూ.22 లక్షల కోట్ల భారత ఇంధన దిగుమతి భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ కొత్త పాలసీ

**కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వాహనదారులకు ఒక తీపికబురు అందించారు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ రేట్ల నుంచి ప్రజలకు ఊరటనిస్తూ.. 100 శాతం ఇథనాల్ ఇంధనంతో నడిచే వాహనాలకు చట్టబద్ధత కల్పించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ విధానాన్ని ప్రకటించారు. - త్రినేత్ర.న్యూస్**

గత కొంతకాలంగా ఇథనాల్ బ్లెండింగ్ గురించి బలంగా వాదిస్తున్న గడ్కరీ.. ఎట్టకేలకు దీనికి చట్టపరమైన గుర్తింపును తీసుకొచ్చారు. "నిన్న రాత్రి సరిగ్గా 8 గంటలకు 100% ఇథనాల్ వినియోగానికి చట్టబద్ధత కల్పించే ఫైల్‌పై నేను సంతకం చేశాను. ఒకప్పుడు నేను ఈ కల గురించి మాట్లాడినప్పుడు చాలామంది నవ్వారు, కొందరు విమర్శించారు కూడా. కానీ ఈరోజు అది నిజమైంది.

**పెట్రోల్ కంటే తక్కువ ధరకే**
20% కంటే ఎక్కువ ఇథనాల్ కలిపిన ఇంధనాలపై ప్రస్తుతం ఉన్న 18% GST ని తగ్గించాలని గడ్కరీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. త్వరలో జరిగే జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్‌లో దీనిపై సానుకూల నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.




ఇది పెట్రోల్‌కు సరైన ప్రత్యామ్నాయంగా మారనుంది," అని ఆయన సగర్వంగా ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల దేశంపై ఉన్న సుమారు రూ. 22 లక్షల కోట్ల చమురు దిగుమతుల భారం గణనీయంగా తగ్గనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**అపోహలు వద్దు.. ఇథనాల్ పవర్ ఫుల్**
ఇథనాల్ వాడితే వాహనాల ఇంజిన్ పాడవుతుందనేది కేవలం ఒక అపోహ మాత్రమేనని గడ్కరీ కొట్టిపారేశారు. సంప్రదాయ ఇంధనాలతో సమానంగా ఇథనాల్ కూడా అద్భుతమైన పనితీరును కనబరుస్తుందని ఆయన స్పష్టం చేశారు.భవిష్యత్తు ఇంధనంగా భావిస్తున్న గ్రీన్ హైడ్రోజన్ వినియోగంపై కూడా గడ్కరీ కీలక ప్రకటన చేశారు. నీటి నుంచి ఎలక్ట్రోలైజర్ ద్వారా సంగ్రహించిన గ్రీన్ హైడ్రోజన్‌తో నడిచే రెండు బస్సులు, ఒక హైడ్రోజన్ పంప్‌తో కూడిన పైలట్ ప్రాజెక్ట్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. సామాన్య ప్రజలు కూడా త్వరలో ఈ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు.

**మార్కెట్లోకి ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు**
ఇథనాల్ వాడకం కేవలం మాటలకే పరిమితం కాలేదు.. ఆటోమొబైల్ రంగాన్ని ఇప్పటికే ఈ దిశగా పరుగులు పెట్టిస్తోంది. మారుతి సుజుకికి చెందిన అత్యుత్తమ మోడల్ 'వాగన్‌ఆర్' 100% ఇథనాల్ వెర్షన్‌ను గడ్కరీ ఇటీవలే లాంచ్ చేశారు.

## భారత్ 'ఇన్నోవేషన్' మంత్రం

- ఏఐ రేసులో మనదే ఆధిపత్యం
- ఫ్రాన్స్ గడ్డపై ప్రధాని మోదీ ప్రకటన

**త్రినేత్ర.న్యూస్ : తన యూరప్ పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఫ్రాన్స్‌లో ఘనస్వాగతం అందుకున్నారు. నైస్ నగరానికి చేరుకున్న ప్రధానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి ప్రతిష్ఠాత్మక 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.**



కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), స్టార్టప్ రంగాలు, టెక్నాలజీలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రధాని మోదీ ప్రపంచానికి చాటిచెప్పారు.

**ఆగని 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్'**
భారతదేశ ఆవిష్కర్తలు నేడు ప్రపంచ మానవాళికి ఉపయోగపడే అద్భుతమైన పరిష్కారాలను కనుగొంటున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. "గత 12 ఏళ్లలో దేశంలో బలమైన ఇన్నోవేషన్ వ్యవస్థను నిర్మించాం. నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా భారత్ అవతరించింది. భారత్‌లో సంస్కరణల పరంపర ఆగదు.. ఈ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' ఇలాగే దూసుకుపోతుంది," అని మోదీ స్పష్టం చేశారు. టెక్నాలజీని ఎప్పుడూ మానవ సంక్షేమం కోసమే వాడాలన్నది భారత్ విధానమని మోదీ పునరుద్ఘాటించారు.

**ట్రంప్‌తో భేటీకి రంగం సిద్ధం**
నైస్ పర్యటన ముగిసిన అనంతరం, ప్రధాని మోదీ ఎవియన్ నగరానికి వెళ్లనున్నారు. అక్కడ జరిగే ప్రతిష్టాత్మక జీ7 సమ్మిట్ లో మోదీ పాల్గొంటారు. ఈ క్రమంలో జూన్ 17న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

## ప్రతిష్ఠాత్మక ఫీఫా వరల్డ్ కప్‌లో అస్సాం అమ్మాయి

- ఏకైక భారతీయ మహిళా ఫోటో జర్నలిస్ట్‌గా చరిత్ర!

**త్రినేత్ర.న్యూస్ : పురుషుల ఫిఫా వరల్డ్ కప్ 2026 కవరేజ్ కోసం అధికారికంగా ఎంపికైన ఏకైక భారతీయ మహిళా ఫోటో జర్నలిస్ట్‌గా గీతికా తాలూక్దార్ చరిత్ర సృష్టించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా స్పోర్ట్స్ ఫోటోగ్రఫీ రంగంలో ఆమె కొనసాగుతున్నారు. పురుషాధిక్య రంగంగా భావించే క్రీడా జర్నలిజంలో తనదైన ముద్ర వేస్తూ ఆమె ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.**



అరుణాచల్ ప్రదేశ్‌లో జన్మించిన గీతికా.. అస్సాం రాష్ట్రానికి చెందినవారు. ఫీఫా వరల్డ్ కప్ ఈవెంట్‌కు ఎంపికైన ఆమె అరుదైన ఘనతను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కొనియాడారు. ఆమె నిబద్ధత రాబోయే తరాలకు ఎంతో ప్రేరణనిస్తుందని ఆయన ప్రశంసించారు.

**ఒలింపిక్స్ నుంచి ఐపీఎల్ దాకా**
కేవలం పురుషుల టోర్నమెంట్లకే పరిమితం కాకుండా 2019 (ఫ్రాన్స్), 2023 (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) ఫిఫా మహిళల వరల్డ్ కప్‌లను కూడా ఆమె కవర్ చేశారు. అంతే కాకుండా, టోక్యో (2020), పారిస్ (2024) ఒలింపిక్స్ కవరేజ్ కోసం ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ నుంచి నేరుగా గుర్తింపు పొందిన తొలి, ఏకైక భారతీయ మహిళా ఫోటోగ్రాఫర్‌గా కూడా గీతికా రికార్డులకెక్కారు. వీటితో పాటు ఐపీఎల్, ఐఎస్ఎల్, కామన్వెల్త్ గేమ్స్, ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్‌ల వంటి మెగా ఈవెంట్లను కవర్ చేసిన అపార అనుభవం ఆమె సొంతం. 2008లో ప్రారంభమైన ఆమె ప్రొఫెషనల్ జర్నీ నేడు ప్రపంచస్థాయికి చేరింది. ఇండియా టుడే, పీటీఐ, ఏఎఫ్‌పీ వంటి అగ్రశ్రేణి జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల్లో ఆమె ఫోటోలు ప్రచురితమయ్యాయి. క్రీడా జర్నలిజంలోకి అడుగుపెట్టాలనుకునే యువతకు గీతికా తాలూక్దార్ ప్రయాణం ఒక అద్భుతమైన మార్గదర్శి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**వరల్డ్ కప్ జర్నీలో హ్యాట్రిక్**
పురుషుల ఫిఫా వరల్డ్ కప్‌కు గీతికా ఎంపికవడం ఇది తొలిసారి కాదు. గతంలో 2018 రష్యా వరల్డ్ కప్, 2022 ఖతార్ వరల్డ్ కప్‌లలోనూ ఆమె ఫోటో జర్నలిస్ట్‌గా తన సేవలు అందించారు. తాజా 2026 వరల్డ్ కప్ కవరేజ్‌తో ఆమె హ్యాట్రిక్ (మూడోసారి) సాధించారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌ను కవర్ చేసేందుకు వరుసగా మూడోసారి ఫిఫా అక్రిడిటేషన్ పొందడం పట్ల గీతికా హర్షం వ్యక్తం చేశారు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య, ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# దోపిడీదారులకు స్థానం లేదు

- సింగరేణిలో కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే క్షమించం
- శ్రీరామ్‌పూర్ ఓపెన్ కాస్ట్ బొగ్గు గని సందర్శనలో ఉపముఖ్యమంత్రి భట్టి

**సింగరేణిలో దోపిడీదారులకు స్థానం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి కార్మికుల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలపై ఆయన మరోసారి నిప్పులు చెరిగారు. తమ రాజకీయ స్వార్థం కోసం సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణి గురించి ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై సమాధానం చెప్పేందుకు ఆదివారం నాడు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైనింగ్ ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపెన్ హౌస్ తనిఖీ నిర్వహించి, వాస్తవాలను వెల్లడించారు. - త్రినేత్ర.న్యూస్**

సింగరేణి సంస్థపై జరుగుతున్న ప్రచారంలో ఏది నిజం, ఏది అబద్ధమనే వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలనే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థ ప్రయోజనాల కోసమే అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం చెప్పేది కేవలం నిజాలు మాత్రమేనని, ఆ నిజాన్ని ప్రజల ముందు ఉంచడమే తమ బాధ్యతని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.
రాష్ట్రానికి మకుటాయమానమైన సింగరేణి సంస్థను అభాసుపాలు చేయాలనే తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు కేంద్రానికి లేఖలు రాయడం సత్యదూరంగా ఉన్నాయి. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ భవిష్యత్తును, సింగరేణి సంస్థను వాడుకోవడం సరికాదు అని భట్టి హెచ్చరించారు.



**ఇది ప్రజల ఆస్తి..**
సింగరేణి కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు. ఇది తెలంగాణ ప్రజల ఆస్తి. మైన్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు అక్కడ అమలు అవుతున్న భద్రతా ప్రమాణాలు, బొగ్గు రవాణాకు సంబంధించిన లెక్కలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీరాంపూర్ ఓసీ మైన్ నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం మరో 28 సంవత్సరాల పాటు ఇక్కడ బొగ్గు ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. సింగరేణి సంస్థలో జరుగుతున్న ప్రతి ప్రక్రియ అత్యంత ఆధునికంగా, కంప్యూటరైజ్డ్ విధానంలో పారదర్శకంగా సాగుతోందని వివరించారు.

**రూ.కోటీ 25 లక్షల ప్రమాద బీమా..**
ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స అందించేందుకు వీలుగా 'క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులను' మంజూరు చేస్తున్నాం. దేశంలోనే మొదటిసారి రూ.కోటి 25 లక్షల ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని భట్టి గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల పిల్లలు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతుంటే, వారికి అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని, సహకారాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, సింగరేణి సంస్థ సీఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్, ఇతర నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ఫిఫా వరల్డ్‌కప్‌లో మూడోరోజు మ్యాచులు అభిమానులను ఉత్కంఠకు గురి చేశాయి. ఆదివారం ఐదు మ్యాచులు జరగాల్సి ఉండగా.. ఇందులో నాలుగు మ్యాచులు ముగిశాయి. చివరి మ్యాచ్‌లో జర్మనీ-మొరాకో మధ్య జరుగనున్నది. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం రాత్రి 10.30 గంటలకు జరుగనున్నది. మూడో రోజు పోటీల్లో ఖతార్ చివరి నిమిషాల్లో అద్భుతంగా పుంజుకుని స్విట్జర్లాండ్‌ను నిలువరించింది. మొరాకో చేతిలో బ్రెజిల్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ఆస్ట్రేలియా మాత్రం తుర్కియేపై ఏకపక్ష విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో హైతిపై స్కాట్లాండ్ విజయం సాధించింది.



- **ప్రపంచకప్‌లో స్కాట్లాండ్‌కు చారిత్రక విజయం**

ఫిఫా ప్రపంచకప్‌లో స్కాట్లాండ్ చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. 36 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ వేదికపై విజయాన్ని అందుకున్న స్కాట్లాండ్ గ్రూప్–సీ తొలి మ్యాచ్‌లో హైటీపై 1–0 తేడాతో గెలిచి శుభారంభం చేసింది. జాన్ మెక్‌గిన్ చేసిన ఏకైక గోల్ జట్టుకు మూడు పాయింట్లు అందించింది. అమెరికాలోని బోస్టన్ స్టేడియంలో 28వ నిమిషంలో జాన్ మెక్‌గిన్ కొట్టిన షాట్ ప్రత్యర్థి ఆటగాడిని తాకి దిశ మార్చుకుని గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో స్కాట్లాండ్‌కు కీలక ఆధిక్యం లభించింది. హైతీ పలు అవకాశాలు వచ్చినా గోల్‌గా మార్చలేక పోయింది. స్కాట్లాండ్ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకుని విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో గ్రూప్–సీలో స్కాట్లాండ్ అగ్రస్థానానికి చేరుకుంది. రాబోయే మ్యాచులు ఆ జట్టుకు కీలకంగా మారాయి. బ్రెజిల్, మొరాకో వంటి బలమైన జట్లతో పోటీ పడాల్సి ఉంది.



# తుర్కియేకు ఆసీస్ షాక్

## ఫుట్‌బాల్ మహాసమరంలో రసవత్తర పోరు..!

- **2-1 తేడాతో గెలుపు**
- **స్విట్జర్లాండ్-ఖతార్ మ్యాచ్ డ్రా**
- **బ్రెజిల్‌కు సవాల్ విసిరిన మొరాకో**
- **స్కాట్లాండ్‌కు తొలి విజయం**

- **తుర్కియేపై ఆస్ట్రేలియా సునాయాస విజయం**


గ్రూప్–డీలో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 2–0 తేడాతో తుర్కియేపై సునాయాస విజయం సాధించింది. మ్యాచ్ మొత్తం ఆస్ట్రేలియానే ఆధిపత్యం చెలాయించగా.. తుర్కియే జట్టు పెద్దగా ప్రతిఘటించలేక పోయింది. తొలి అర్ధభాగంలో నెస్టోరి ఇరాంకుందా ఆస్ట్రేలియాను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. పాల్ ఓకాన్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న బాల్‌నునెస్టోరీ గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌తో ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలో ఆస్ట్రేలియా తరఫున గోల్ చేసిన అతి పిన్న వయస్కుడిగా నెస్టోరీ రికార్డును నెలకొల్పాడు. ఆ తర్వాత టర్కీ ఆటగాళ్లు మ్యాచ్‌ను డ్రా చేయడానికి తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆస్ట్రేలియా డిఫెన్స్ దాన్ని తిప్పికొట్టింది. ముఖ్యంగా 75వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ కానర్ లో–షాట్‌తో రెండో గోల్ కొట్టి ఆస్ట్రేలియా విజయాన్ని ఖరారు చేశాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 22 ఏళ్ల యువ గోల్‌కీపర్ పాట్రిక్ బీచ్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. టర్కీ జట్టు చేసిన పలు ప్రమాదకరమైన గోల్ ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకొని క్లీన్ షీట్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియా బోణీ కొట్టింది. ఇదిలా ఉండగా.. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఫిఫా ప్రపంచకప్ బరిలోకి తుర్కియే బరిలోకి దిగగా.. ఆ జట్టుకు తొలి మ్యాచ్‌లో నిరాశే ఎదురైంది.


- **బ్రెజిల్‌కు మొరాకో సవాల్..**

ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ తన తొలి మ్యాచ్‌లో స్థాయికి తగ్గట్లుగా ఆడలేకపోయింది. గ్రూప్–సీలో మొరాకోతో జరిగిన మ్యాచ్‌ను 1–1తో డ్రాగా ముగిసింది. మ్యాచ్ ఆరంభం నుంచే మొరాకో దూకుడుగా ఆడింది. తొలి 30 నిమిషాల్లోనే బ్రెజిల్ గోల్‌పోస్ట్ వైపు దూసుకువస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. 21వ నిమిషంలో మొరాకో ప్లేయర్ ఇస్మాయిల్ గోల్ వేసి జట్టులో ఉత్సాహం నింపాడు. ఆ తర్వాత 32వ నిమిషంలో వినీసియస్ జూనియర్ అద్భుతమైన గోల్‌తో బ్రెజిల్‌ను గట్టెక్కించాడు. ఆ తర్వాత రెండుజట్లు హోరాహోరీగా తలపడినా గోల్స్‌ను వేయలేకపోయాయి. అయితే, మ్యాచ్‌లో బ్రెజిల్ ఆధిపత్యం కొనసాగినా మ్యాచ్‌లో విజయం సాధించలేక పోయింది. అయితే, ప్రపంచకప్ తొలి మ్యాచుల్లో బ్రెజిల్ విజయం సాధిస్తూ రాగా.. ఈ సారి మాత్రం టైగా ముగిసింది. 1934 తర్వాత నుంచి జరుగుతున్న సాకర్ ప్రపంచకప్ ప్రారంభమ్యాచుల్లో ప్రతీది గెలువగా.. ఈసారి మాత్రం గెలువలేకపోయింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్ జూనియర్ నెయ్‌మర్ లేకపోవడం ఆ జట్టు బలాన్ని దెబ్బతీసింది.

- **ఖతార్ అద్భుతం**

గ్రూప్–బీలో స్విట్జర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను ఖతార్ 1–1తో డ్రా చేసుకుంది. మ్యాచ్ ముగిసే కొద్ది క్షణాల ముందు బౌలెమ్ ఖౌఖీ గోల్ వేసి ఖతార్‌కు విలువైన ఒక పాయింట్ అందించాడు. 17వ నిమిషంలో బ్రెల్ ఎంబోలో పెనాల్టీని గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మ్యాచ్ మొత్తం స్విస్ జట్టే పైచేయి సాధించినప్పటికీ, పలు అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. దీంతో ఖతార్‌కు తిరిగి మ్యాచ్‌లోకి వచ్చే అవకాశం లభించింది. రెండో అర్ధభాగం ఇంజరీ టైమ్ నాలుగో నిమిషంలో ఖౌఖీ హెడ్డర్‌తో సమం చేశాడు. దీంతో టోర్నీలో ఖతార్ ఖాతాలో తొలి పాయింట్ జమైంది.







## రష్మికు కృతి రక్షణ.. వీడియో వైరల్

నేషనల్ క్రష్ రష్మిక మందన్నకు చేదు అనుభవం ఎదురైంది. కాక్‌టెయిల్ 2 మ్యూజికల్ ఫెస్ట్ పేరుతో శనివారం పుణెలోని ఓ మాల్‌లో భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేశారు. షాహిద్‌కపూర్, రష్మిక మందన్నతో పాటు కృతి సనన్ అటెండ్ అయ్యారు. వారిని చూడగానే అభిమానులు ఒక్కసారి బారికేడ్లను తోసుకుంటూ ముందుకొచ్చారు. రష్మిక, కృతి సనన్‌తో పాటు షాహిద్ కపూర్‌ను చుట్టుముట్టారు. హీరోయిన్లను తాకేందుకు ప్రయత్నించగా రష్మిక భయంతో వణికిపోయింది. దాంతో కృతిసనన్ ఆమెకు రక్షణ వలయంలా నిలిచిం క్షేమంగా బయటకు తీసుకొచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఫ్యాన్స్ తీరుపై పలువురు సెలబ్రిటీలతో పాటు నెటిజన్లు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ మూవీ జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. హోమీ అద్జానియా దర్శకత్వం వహించాడు.





Cinema

## మళ్లీ డ్యూయల్ రోల్‌లో..

చిరంజీవి హీరోగా బాబీ డైరెక్షన్‌లో రూపొందుతోన్న మెగా 158 మూవీపై ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో మెగాస్టార్ డ్యూయల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చెబుతోన్నారు. చిరంజీవి సోదరుడిగా తొలుత మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ కనిపించబోతున్నట్లు వార్తలొచ్చాయి. కానీ మోహన్‌లాల్ బిజీగా ఉండటంతో సినిమా చేయలేకపోయారట. దాంతో ఆ రోల్‌లో కూడా చిరంజీవే కనిపించనున్నారట. ద్విపాత్రాభియానికి తగ్గట్లుగా కథలో బాబీ మార్పులు చేర్పులు చేసినట్లు చెబుతోన్నారు. ఓ పాత్ర క్లాస్‌గా, మరో పాత్ర మాస్ యాంగిల్‌లో సాగుతుందని అంటున్నారు. సంక్రాంతికి రిలీజ్ చేయాలని మేకర్స్ టార్గెట్‌గా పెట్టుకున్నారట. తమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

## సుశాంత్ ఇంట్లో పాజిటివ్ వైబ్స్: అదా శర్మ

దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ చనిపోయిన ఇంట్లో నివాసం ఉండటంపై బాలీవుడ్ నటి అదా శర్మ కుండబద్దలు కొట్టారు. ముంబైలోని ఆ డూప్లెక్స్ ఫ్లాట్‌లో తనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని స్పష్టం చేశారు. సుశాంత్ 6వ వర్ధంతి (జూన్ 14) సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడేళ్లుగా మూతపడిన ఇంటిని తెరిచినందుకు స్థానికులు సంతోషించారని, కానీ ఆన్‌లైన్‌లో కొందరు 'క్లిక్‌బేట్' కోసం నెగెటివ్ ప్రచారం చేశారని విమర్శించారు. ట్రోల్స్‌ను తాను పట్టించుకోనని, ఆ విశాలమైన ఇంట్లో పాజిటివ్ వైబ్స్ ఉన్నాయని, అక్కడే సరికొత్త, సంతోషకరమైన జ్ఞాపకాలను సృష్టించుకోవడంపైనే దృష్టి పెట్టానని అదా శర్మ స్పష్టం చేశారు.



## నేను విన్న విచిత్ర రూమర్ అదే..

బాలీవుడ్ హాట్ బ్యూటీ మౌనీరాయ్ లెస్బియన్ అంటూ చాలా కాలంగా రూమర్లు వినిపిస్తున్నాయి. ఈ పుకార్లపై ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఫన్నీగా రియాక్ట్ అయ్యింది. నాపై గే అనే ముద్ర వేశారు. నేను విన్న అతి విచిత్రమైన రూమర్ అదే. ఆ పుకారు ఎలా వచ్చిందో.. ఎవరూ ప్రచారం చేశారో తెలియదు. కానీ అదంతా అవాస్తవమే. నా గర్ల్ ఫ్రెండ్స్‌తో దిగిన ఫొటోలను చూసి చాలా మంది అపార్థం చేసుకున్నారు. ఇద్దరు క్లోజ్‌గా కనిపించగానే వారిపై ఓ అభిప్రాయానికి రావడం కరెక్ట్ కాదు. విడాకుల తర్వాత జీవితం మొత్తం శూన్యంలా అనిపించింది. ఎటు అడుగులు వేయాలో అర్థం కాలేదు. ఆ కష్టకాలంలో స్నేహితులు నాకు అండగా నిలిచారు. అలాంటి గర్ల్‌ఫ్రెండ్స్ ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పుకొచ్చింది మౌనీ. కాగా చిరంజీవి విశ్వంభర సినిమాతో ఈ అమ్మడు బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది.

## ఓటీటీలో త్రిష మూవీ ట్రెండింగ్

సూర్య, త్రిష హీరోహీరోయిన్లుగా నటించిన కరుప్పు మూవీ థియేటర్లలోనే కాకుండా ఓటీటీలోనూ అదరగొడుతోంది. ఫాంటసీ యాక్షన్‌గా రూపొందిన ఈ మూవీ ఇటీవలే అమెజాన్ ప్రైమ్ వీడియోలో రిలీజై, నేషనల్ వైడ్ టాప్ ట్రెండింగ్ మూవీస్ లిస్ట్‌లో నంబర్ వన్ ప్లేస్‌లో నిలిచింది. ఈ వీక్ ప్రైమ్‌లో హయ్యెస్ట్ వ్యూస్ వచ్చిన సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసింది. ఓటీటీలోనూ కరుప్పు సూపర్‌హిట్‌గా నిలవడంతో మేకర్స్ ఫుల్ ఖుషీ అవుతోన్నారు. ఈ మూవీకి ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహిస్తూనే విలన్‌గా నటించాడు. 140 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ థియేటర్లలో 350 కోట్ల వరకు వసూళ్లను రాబట్టి, ఈ ఏడాది హయ్యెస్ట్ కలెక్షన్స్ సాధించిన తమిళ సినిమాగా కరుప్పు నిలిచింది.

